# నైజగుణం

"తినరా... తిను.... కూడు తినకండా నా మొగం సూత్తావేటి... నా మొగాన బొమ్మ లాడుతున్నాయా?" సొట్టలు పడిన కంచంలో ఆఖరి ముద్ద ఊడ్చి నోట్లో పెట్టుకొంటూ అన్నాడు అప్పన్న.

అప్పన్న మాటలు రాముడి చెవుల్లో పడ్డాయో... లేదో. చూపులో మాత్రం ఎటువంటి మార్పు లేకుండ అలాగే చూస్తున్నాడు అప్పన్న వంక. ఉలుకూ పలుకూ లేకుండా మొండిగా అలా కూర్చున్న రాముణ్ణి చూస్తే అప్పన్నకి చిర్రెత్తుకొచ్చింది.

"ఏటిరా.... ఏటాయేసాలు... నా బొట్టెలంతా తినలా? కూడు తినమంటే ఇసం తినమన్నట్టు అట్టా ఏడుపు మొగం ఏసుకు సూత్తావేట్రా?" ముంతలో నీళ్ల గటగట చప్పుడయేలా నోట్లో ఎత్తిపోసుకొని తాగి, ముంత కిందపెడుతూ అన్నాడు అప్పన్న.

ఉహూ.... రాముడి చూపు పక్కగా పింగాణీ కంచంలో ఉన్న పప్పన్నం మీదికి పోనేలేదు. జాలిగా, దీనంగా అప్పన్న వంకే అలా చూస్తున్నాడు. 'నేను తినలేను, అప్పన్నా! లేకుంటే తిననూ?' అన్నట్లు ఉంది ఆ చూపు.

తంపి మీద కాగిన పాల మీగడలా ఎరుపు ధవిళికి తిరిగి ఉంది రాముడి శరీర వర్ణం. అందమైన ముఖంలో నల్లని సోగకళ్లు చూడముచ్చటగా ఉన్నాయి. రెండు రోజులై తిండిలేక ముఖం వాడి ఉంది. కడుపు లోతుకి పోయి పక్కలు అంటుకు పోయినట్లు ఉన్నాయి. మిలమిల మెరుస్తున్న ఆ కళ్లల్లో లీలగా నీళ్లు తిరుగుతున్నట్లు అనిపించింది అప్పన్నకు. రాముణ్ణి ఆ స్థితిలో చూసి అప్పన్న కడుపులో కలచినట్లు అయింది. కోపం, విసుగు స్థానాన్ని జాలి, ఆప్యాయత చోటు చేసుకొన్నాయి. ఎడం చేత్తో మెల్లగా రాముణ్ణి దగ్గరకి తీసుకొన్నాడు. బుజ్జగిస్తున్నట్లు తల నిమిరాడు.

"నా మాటినరా రావుడూ... ఇట్టా మొండికేసి కూకుంటే నిస్కారనంగా తిండిలేక సచ్చిపోతావురా. సూద్రా ఈ రెన్నాళ్లకే నీ మొగం ఎట్టా వాడిపోనాదో!..."

రాముడు ప్రేమగా అప్పన్న వంక చూసాడు. బాధతో ఏదో చెప్పాలని నోరు తెరచాడు. అంతలో మళ్లా ఏమనుకొన్నాడో, నోరు మూసుకొని అప్పన్న ఒడిలో తల పెట్టుకొని పడుకొన్నాడు. అప్పన్న ఎన్నివిధాల బ్రతిమాలినా ఎదురుగా కంచంలో ఉన్న అన్నం తినడానికి ఎటువంటి ప్రయత్నం చెయ్యలేదు. అలా కళ్లు మూసుకొని అప్పన్న ఒడిలో నిద్రపోడానికి సిద్ధపడ్డాడు.

రాముడి మొండి పట్టుదల చూసి అప్పన్నకి ఒక్కసారిగా తిక్కరేగింది. విసురుగా వాణ్ణి తోసిపారేసి, "ఏటిరా సెప్తుంటే నీ మొండితనం... తింటే తిను.... నేకుంటే సావు.... ఇంటో సికాకులు తోటే నా పానం పోతుంటే నా పీక మీదికి నువ్వొకడివి!" అంటూ

విసుక్కొంటూ పక్కనున్న తుండుగుడ్డని పై మీద వేసుకొని, తిన్న కంచం చేత పుచ్చుకొని లేచిపోయాడు.

పది గజాల దూరంలో ఉన్న కుళాయి దగ్గర సిలవరి కంచాన్ని పేడా, మన్ను వేసి తోమి, నీళ్లతో కడిగి పక్కనున్న రాతి మీద కాలబెట్టాడు. భోజనానికి ముందు ఇంటి పెణకలో దాచిన సగం కాలిన చుట్ట తీసి, కొడి దులుపి మళ్లా వెలిగించాడు. పక్కగా ఉన్న మంచంమీద నడ్డి వాల్చి గట్టిగా నాలుగు దమ్ములు లాగాడు.

కడుపులో తిండి పడ్డంతో అప్పన్న కళ్లు అనుకోకుండానే మూతలు పడ్డాయి. అతడు ఓ కునుకు తీసి లేచేసరికి ఆకాశం మీద వెలుగు పోయి చీకటి అలముకొంది. ఎదురుగా పెద్ద మేడ దీపాలు లేక దిగులుగా పడి ఉంది. మేడంతా చీకటిగా ఉన్నా ముందు వరండాలో మాత్రం లైటు వెలుగుతున్నది.

"ఇంకా అమ్మగోరు ఎప్పటికి వత్తారో.... ఏమో?" ఆ రోజుకి వందోసారి అను కొన్నాడు అప్పన్న ఆ మాటని.

అమ్మగారి మాట తలపుకి వచ్చేసరికి రెండు రోజులై తిండి ముఖం చూడక నిరాహార దీక్ష పూనిన రాముడు గుర్తుకు వచ్చాడు. "ఈపాటికైనా తిన్నాడో.... నేదో" అనుకొంటూ తల కింద పెట్టుకొన్న తుండుగుడ్డని తీసి, గాలిలో దులిపి, సాపుచేసి తలకి చుట్టుకొంటూ అటు నడిచాడు.

రాముడు ఉన్నచోటునే ముడుచుకొని పడుకొన్నాడు. ఆకలి కడుపుకి ఊతగా రెండు కాళ్లు డొక్కలో దోపుకొన్నాడు. కంచంలో అన్నం పెట్టింది పెట్టినట్లే ఉంది. నేల మీంచి ఎర్ర చీమలు బారులు కట్టాయి. "ఏటిసెయ్యడం?.... ఎలా సావడం?" కోపం, విసుగు, చేతకానితనం ముప్పిరిగొనగా తనలో తనే గొణుక్కుంటూ బుర్ర గోక్కున్నాడు అప్పన్న.

"ఆ మేనేజరయ్యయినా వత్తే బాగుండిపోను. అడవాన్సుగా పదో పరకో అడిగి... ఉహూ....ఆడెక్కడ ఆడు... ఆడి అమ్మ వంక ధనం ధారపోత్తున్నట్టు గింజుకుపోతాడు నెల జీతం ఇచ్చేతలికే. మల్లా అయ్యగోరు ముందు కబుర్లకేం నోటు లేదు. ఆరు ఏ మాట సెప్పినా... 'మీకెందుకు అయన్నీ నే సూసుకొంటాగా' అంటూ అనుమంతుడిలా సేతులు కట్టుకొని నిలబడ్తాడు... ఏదీ సూద్దం? అయ్యగోరి కారు గేటు దాటిందో నేదో ఇటు ఇంటికి తాలం పెట్టి అదే పోనాడు... తిరిగి యింటి మొగం సూత్తే ఒట్టు.

అంత జీతం ఉచ్చుకొంటున్న ఆడికన్న ఈరిగాడే నయం. అయ్యున్నా.... అమ్మున్నా, ఏరున్నా నేకున్నా తన యాలకి టంచనుగా వచ్చి ఆ వరండాలో కూకుంటాడు. కూకుని, కూకుని ఏదో ఓ నిముసం కల్లు వాలితే ఏటిగాని రేతిరంతా నడ్డి సేరయేడం అన్నమాట నేదుకదా?

ఆయిగా కూదు తినొచ్చి లొల్లాయి పదాలు పాడుకొంటూ కూకుంటాడు. ఆడికేం?... తనలా పెల్లాం, పిల్లలు, రోగాలు, రొచ్చులు ఈ బెడదలేం నేవుకదా. 'ఒరే అప్పన్నా, నా

మాటిను.... మణిసిగా సుకపడాలంటే బెమ్మచారిగానే ఉండి పోవాల్రా.... పెల్లి, పెల్లాం అని చంబరపడ్డామో.... అల్ల కోసం నానా గడ్డి తిని సావాలి. అయినోరిని కానోరిని కాల్లట్టుకు బతిమాలాలి" అంటాడు.

ఆడిమాట అచ్చరాలా నిజం. మంచాన పడి సచ్చేట్టున్న ఆ పోలి కోచం కాకపోతే ఇట్టాటి పని తన జలమలో ఏనాడైనా సేసేడా? అమ్మగోరొచ్చి, "అప్పన్నా, నువ్వేటో మంచోడివి, నమ్మవలసినోడివి అనుకొంటే... ఛీ.... ఇలాటి యెదవపని సేసేవేట్రా... అయిదో.... పదో కావాలంటే అయ్యగోర్ని అడగాలకాని..." అంటే....ఈదిలో తిండి లేక పడి సావనున్నోడిని తెచ్చి ఇల్లు కట్టి, పెల్లి చేసి ఓ ఇంటోడిని సేసిన ఆ యమ్మకి అన్నాయం సేస్తే పురుగులడి సచ్చిపోడం తప్పదు.

ఆయాల అయ్యగోర్ని కట్టం సుకం సెప్పి అడగాలనే అనుకొన్నాడు. అడగ్గానే అమ్మగోరిలా గుప్‌సప్‌గా సేతిలో సొమ్ము పొయ్యక పోయినా, 'ఒరే అప్పన్నా, ఉన్నవాల్లకే తిండి పెట్టనేక సత్తున్నావు. మల్లా ఇదేంటిరా... సిగ్గునేదూ?" అంటూ సీవాట్లు పెట్టినా, "పోరా.... పట్టుకుపో.... మంచి డాకటరుని సూసి మందిప్పించు, నీల్లోసుకున్న మడిసిని అలా అచ్చర్ద సెయ్యకూడదు" అనేవోరు.

సమయం చూసుకొని ఆరితో సెప్పాలనుకొంటుండగానే వచ్చిపడింది ఆ మాయదారి టిలిగిరాం... అయ్యగోరు ఎనకా ముందూ సూసుకోకుండా నిలబడ్డోరు నిలబడ్డట్టే కారులో యెక్కి అదే పోనారు. బుల్లెమ్మగోరికి ఎలా ఉందో... ఏటో? ఆ తల్లి మాలచ్చిమి అంత మంచమ్మ గందా, ఇట్టాటి కట్టాలు ఆ మాయదారి దేవుడు ఆయమ్మకే తేవాలా?

పోనసారి కన్నబిడ్డని బూదేవికి అప్పగించి అమ్మగోరు కన్నోరింటినుంచి వచ్చిన్నాడే అయ్యగోరు ఏడనుంచో రావుణ్ణి తీసుకొచ్చినారు. అంత దుక్కంలోను అమ్మగోరు రావుణ్ణి ఆప్యాయంగా అందుకొని గుండెలకి సేర్చుకొన్నారు. 'రావుడూ' అంటూ ఆడి కళ్ళలోకి అభిమానంగా సూసినారు. అప్పుడు ఆడికి ఇంకేదో పేరుండేది. రావుడు అన్న పేరు అమ్మగోరే పెట్టినారు.

అప్పటికాడ నుంచి రావుడంటే అమ్మగోరికి పంచపానాలు. రావుడికి అంతే. ఒక్క నిముసం అమ్మగోరు కనిపించకపోతే గిలగిలనాడిపోతాడు. అమ్మగోరు పార్టీలకి, ఇందులకి ఎల్లి రావడం నేటయితే అట్టగే యెంత రేత్తిరైనా ఈది గుమ్మంలో సూత్తూ కూకునేవోడు.

అమ్మగోరు ఈసారి కనడానికి కన్నోరింటికి పోతూ, తనకి రావుణ్ణి పానంలా సూసుకోమని ఒప్పసెప్పి పోనారు. ఆడి తిండితిప్పలకంటూ ఏరుగా సొమ్ము సేత బెట్టినారు. మొదట అమ్మగోరు కన్నోరింటికి రావుణ్ణి తనతోపాటు తీసుకు పోవాలను కున్నారు. కాని అయ్యగోరు 'మీవాల్లు రావుణ్ణి తిన్నగా సూత్తారో నేదో ఇక్కడే ఉండనీ... అప్పన్నున్నాడు... నానున్నాను' అంటూ ధైర్యం సెప్తే ఇడవనేక ఇడవనేక ఇడిసి ఎల్లేరు. "ఒరే అప్పన్నా, మీ అయ్యగోరి మాటకేంది... ఈ రోజు ఇంట ఉంటే రేపు ఏడకి పోతరో.... నీ మీద బారం పెట్టి పోతన్నారా" అన్నారు.

అవును... అమ్మగోరు రావుడి భారం నా మీద పెట్టి పోనారు. మరి నానేం సేసేను? మూడు నాల్లై రావుణ్ణి పస్తులెట్టాను. ఆకలితో ఆడి కడుపు కాలిపోతున్నాది... అయినా ముద్ద నోట పెట్టకున్నాడు. "అప్పన్నా, నేను తినలేనురా... నా జలమలో ఇట్టాటి తిండి ఎప్పుడైనా తిన్నాన్రా" అన్నట్టు సూత్తాడు. ఏటి సెయ్యడం... ఎలా సావడం...?

అప్పన్న పిచ్చివాడిలా తోటంతా తిరుగుతున్నాడు. దూరంగా పాకలోంచి పోలమ్మ గొంతుక బాధతో మూలుగుతూ వినిపించింది. 'మల్లా ఏటయిందిరా బగమంతుడా!' అనుకొంటూ అటు నడిచేడు అప్పన్న. పోలమ్మ మంచం మీద ఇటు అటు దొర్లుతూ మూలుగుతున్నది.

"ఏటే... పోలీ! ఏటయిందే... డాకటేరు సూదిమందు ఏసినాడుగందా... తగ్గి పోతాదే.... వల్లక కల్లు మూసుకొని తొంగోవే" అంటూ భార్య పక్కలో కూర్చుని నుదుటి మీద చెయ్యి వేసాడు. పోలమ్మ ఒళ్లు వేడి కాలిపోతున్నది. ఎగిరిపడుతున్న ముక్కు పుటాల్లోంచి వేడి ఊపిరి సూటిగా వచ్చి అప్పన్న గుండెల్ని కాలుస్తున్నది. పోలమ్మ మగతగా కళ్లు మూసుకొని ఉంది. కుండలో నీళ్లలో గుడ్డ తడిపి పోలమ్మ నుదుటి మీద వేసి, తల దాకా దుప్పటి కప్పి, నిట్టూరుస్తూ మంచం మీంచి లేచాడు అప్పన్న.

పక్కగా చిన్న మంచం మీద మూడు రోజుల పురిటికందు మాంసం ముద్దలా గుడ్డల మధ్య పడి నిద్రపోతున్నాడు. కొత్తగా ఈ లోకంలో ప్రవేశించిన ఆ జీవి వైపు, తనది అనుకున్న ఆ పసివాడివైపు ఆప్యాయంగా, ఆనందంగా చూసాడు అప్పన్న. "అయిదుగురు ఆడోల్ల తర్వాత అనుగ్గరించేవు, బగవంతుడా ఈడికి తల్లిలేని లోటు రానీకు" అనుకున్నాడు మనసులోనే దేవుణ్ణి ప్రార్థిస్తూ.

ఆ నిముషంలో అతడి అలోచనల్లో మూడు రోజులై తిండిలేక మాడుతున్న రాముడు లేడు. ఆ రాముడి బాధ్యత తనమీద పెట్టి పుట్టింటికి వెళ్లిన అమ్మగారు లేరు. ఎదురుగా తన వంశోద్ధారకుడు అయిన కొడుకు, వాడిని తనకు ప్రసాదించిన తల్లి... ఎలాగైనా సరే వాళ్లిద్దర్నీ తను రక్షించుకోవాలి. వాళ్ల కోసం ఏ పనైనా సరే చెయ్యాలి. రాముడు తిండిలేక చస్తే చావనీ, యజమానురాలు తిరిగివచ్చి తన్ను తిడితే తిట్టనీ.... చేస్తున్న నౌకరీ పోతే పోనీ...

అప్పన్న మనసులో అంతకు పూర్వం కదులాడిన సున్నిత భావాలు గాలికి చెదిరిపోతే మేఘంలా తునాతునకలై పోయాయి. మనసులోని పాపభీతి పోయి ఏదో మొండి ధైర్యం పుట్టుకొచ్చింది. తను చేసిన పని న్యాయమైనదే అన్న నమ్మకం కుదిరింది. "అమ్మగోరు మాత్తరం ఏటంటారు? ఈతల మనిసి పానం పోతుంటే... డబ్బు సేతిలో యెయ్యందే డాకటేరు సూదిమందు యేయనంటే సావమంటారా?... కాల్లబడి అడగాలంటే అయ్యగోరు కాని, ఆ మేనేజరయ్య కాని లేకపోయే... సేతిలో వున్న సొమ్ము ఎంకటేసుడికి ముడుపు కట్టినట్టు నాది కాదు.... రావుడిది అని ముట్టకుండా ఎట్టాగుంటాను? అక్కడికీ అల్ల

కాళ్లు పట్టి, సేతులు పట్టి రావుడికి తిండిని నోటు రాకుండా పప్పన్నం తెచ్చి పెడ్తానే వున్నాడు. తిన్నని ఆడు బీస్మించుకొని కూకుంటే తనేటి సేస్తాడు?

ఆలోచిస్తూనే అప్పన్న మేడ వైపు నడిచాడు. వీరిగాడు హుషారు కోసం బీడీ మీద బీడీ వెలిగిస్తూ ఇంటి నాలుగు పక్కల తిరుగుతున్నాడు. వాడి అడుగులో అడుగు వేస్తూ వెనకెనకనే తిరుగుతున్నాడు రాముడు. పోర్టికోలోకి వచ్చేసరిగా ఆశగా ఇంటివైపు చూస్తున్నాడు. చావిట్లోంచి తలుపు తెరచుకొచ్చి 'రాముడూ' అని పిల్చే అమ్మగారి పిలుపు కోసం. మూసివున్న తలుపుకి కిందుగా వేలాడుతున్న తాళం కప్పవైపు చూసి నిరాశగా కళ్లు దించుకుని మళ్ళీ వీరిగాడి వెంట నడుస్తున్నాడు.

"నీ పెల్లాం ఎంత మంచానపడ్డా యీడి పొట్ట కొట్టడం అన్నాయంరా, అప్పన్నా... సూడు తిండినేక ఎట్టా నోతుకి పోనాడో" అన్నాడు వీరిగాడు బీడీ ఆఖరి దమ్ము లాగి అవతల పారేస్తూ.

మనిషి తనకి తానుగా తను చేసిన పని తప్పు అని పశ్చాత్తాప పడ్డం వేరు. ఎదుటివాడు తప్పు ఎత్తి చూపడం వేరు.

"అంత జాలి కలోడివి నువు తెచ్చిపెట్టరాదూ?" అన్నాడు అప్పన్న కోపంతో.

"నానెందుకు పెట్టాల? డబ్బుచ్చుకొన్నవోడివి నువ్వు... అమ్మగోరు రావుణ్ణి అప్ప సెప్పింది నీకు. తిండినేక ఆడ్ని అలా ఉచురు పెట్టడం నాయం కాదురా, పిల్లలోడివి, అంటూ మంచిమాట సెప్తే నా మీద నేత్తున్నావు. ఆ రావుడెట్టా పోతే నాకేటి?... నువ్వెట్టా పోతే నాకేటి?" నేల మీద తబుక్కున ఉమ్మి, నీతో నాకేం పని అన్నట్లు కర్ర తాటిస్తూ వెళ్లిపోయాడు వీరిగాడు.

అంతకన్నా గట్టిగా కాండ్రించి ఉమ్మి తన ఇంటి వైపు నడిచాడు అప్పన్న. నిట్రాట పాక అల్లంత దూరంలో ఉండగానే పోలమ్మ వికృతంగా పెట్టిన కేక వినిపించింది. అదిరే గుండెలతో అప్పన్న పరుగుపెట్టి ఇంట్లోకి వెళ్లేసరికి విలవిల కాళ్లూ, చేతులూ కొట్టుకొంటున్నది పోలమ్మ. ఆ కేకతో లేచిన పిల్లలు తల్లి కేమయిందో తెలియక గొల్లున ఏడవడం మొదలుపెట్టార.

"సిట్టీ అమ్మని సూత్తుండే..... నానుపోయి డాకటేరుని పిలుసుకొత్తా" అంటూ చేతికర్ర పట్టుకొని పరుగుపెట్టాడు అప్పన్న.

అతడు బైటికి వస్తుంటే అలజడి విని వచ్చిపడ్డాడు రాముడు.

"ఒరే రావుడూ, నా పోలి సచ్చిపోతన్నాదిరా.... డాకటేరు కోసం పోతున్నా.... కూతంత సూత్తుండరా" అంటూ ఓ కేక పెట్టాడు అప్పన్న. అతడి ఆరాటం, బాధ అర్థమైనట్లే చూసాడు రాముడు. 'నువ్వెళ్లు... ఫరవాలేదు... నే చూస్తుంటాలే" అన్నట్లు పాకవైపు నడిచాడు.

కారులు, టెలిఫోన్లు ఉన్నవాళ్లకైతే ఏ సమయంలో అంటే ఆ సమయంలో డాక్టర్లు పలుకుతారు. అప్పన్న లాంటివాళ్లు పిలిస్తే, ఆ నిశిరాత్రిలో అవతల మనిషి ప్రాణం పోతూందన్నా వచ్చే డాక్టర్లు ఎంతమంది ఉంటారు? అతడు కాదని ఇతడు.... ఇతడు కాదని ఇంకొకడు, డాక్టరు అని బోర్డు కనిపించిన చోటికల్లా పరుగులు పెట్టాడు అప్పన్న. తిరిగి, తిరిగి అతడి కాళ్ళు లాక్కొస్తున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. ఫలితం మాత్రం శూన్యం. 'నే వస్తున్నా, పద అప్పన్నా' అంటూ ఏ ధర్మాత్ముడూ ముందుకి రాలేదు.

ఏమి చెయ్యడానికీ లేక, మతిపోయిన వాడిలా నాలుగు రోడ్ల కూడలిలో నిలిచి పోయాడు అప్పన్న. అతడి బాధ చూసి ఆ దేవుడే పంపినట్లు ఎక్కడి నుండో రిక్షా నడుపుకొంటూ వచ్చాడు హనుమాన్లు.

"ఏటిరా మావా? ఏటిక్కడున్నావు?" అంటూ ప్రశ్నించాడు.

అప్పన్న తనకి సంభవించిన కష్టం చెప్పుకొన్నాడు.

"రిచ్చా ఎక్కు. సెరువు గట్టుకాడ ఈదిలో ఓ డాకటేరు ఉన్నాడు. ఆడకి పోదాం" అన్నాడు హనుమాన్లు.

అప్పటికే అప్పన్న ఇల్లు విడిచి చాలా సమయం అయింది. పోలమ్మ ఎలా వుందో... అసలు మనిషి బ్రతికుందో... లేదో? ఈ డాక్టర్ల కోసం తిరిగేకన్నా తిన్నగా యింటికి పోతే కాలూ, చెయ్యీ రాస్తూ, చివరి క్షణాల్లో భార్య దగ్గర ఉన్నట్లేనా అవుతుంది అనుకున్నాడు అప్పన్న.

"లేదురా అప్పన్నా... ఈ డాకటేరు మంచోడు. ఎంత రేతిరేళ్ల ఓరు పిల్చినా వత్తాడు" అంటూ ధైర్యం చెప్పాడు హనుమాన్లు.

అతడో కుర్ర డాక్టరు. అంతగా ప్రాక్టీసు లేనివాడు. అందుకే ఎవరు ఏ సమయంలో పిల్చినా 'సరే' అంటాడు. కాని ఫీజు ముందుగా చేతిలో పడందే కాలు కదపడు. అప్పన్న తన గోడు అంతా చెప్పగానే చెయ్యి ముందుకి చాపేడు. అప్పన్న దగ్గర ఉన్నపళంగా అతడి చేతిలో పొయ్యడానికి డబ్బెక్కడ ఉంది? ఆ డబ్బే వుంటే రాముణ్ణి మూడు రోజులై పస్తు పడుకో పెట్టాడా?

"పిల్లలు గలాణ్ణి సామీ... అది కన్ను మూసిందంటే అంతా అద్దాన్నం అయిపోతాం. అమ్మగోరు రాగానే అణా పైచలతో తమ ఫీజు ఇచ్చుకుంటాను. ఓసారి వచ్చి సూసి పొండి, బాబూ" అంటూ బ్రతిమాలుకొన్నాడు అప్పన్న.

ఫీజు అంతా కాకపోయినా సగమైనా చేతిలో పడందే కదలనన్నాడు ఆ డాక్టరు.

"మీ పబ్బం కాస్తా గడిచిపోతే మళ్లీ మీరు ముఖం చూపిస్తార్రా?... ఆ వెనుక వసూలు చేసుకోలేక మేము చావాలిగాని" అన్నాడు.

"ఇంద, మావా" బనీను లోపలి జేబులోంచి రెండు పదులు తీసి అప్పన్న చేతిలో పెట్టాడు హనుమాన్లు. పైడితల్లి పండక్కి పెళ్లానికి కొత్త కోక కొనుక్కు పోవాలని రెండు నెలలుగా టీ నీల్లు తాగకుండా కూడబెట్టిన సొమ్ము అది.

"అనుమాన్లూ!" అన్నాడు అప్పన్న నీళ్లు నిండిన కళ్లతో అతడి చేతులు పట్టుకుని.

"అయన్నీ ఇప్పుడు కాదు. ముందు డాకటేరుని పిల్చుకుపో" రిక్షా ఎత్తి పట్టుకుంటూ అన్నాడు హనుమాన్లు.

తన పక్కన అప్పన్న రిక్షాలో కూర్చోడం డాక్టరుకి ఇష్టం లేదు. ఇబ్బందిగా ఇటూ అటూ చూసాడు. కాని ఆ సమయంలో చుట్టుపట్ల ఇంకో వాహనమేదీ కన్పించలేదు. ఇంక తప్పదన్నట్లు అటు ముఖం తిప్పుకొని కూర్చున్నాడు.

పాకలో కాలు పెట్టేసరికి అప్పన్నకి కళ్లు తిరిగాయి. పాక ముందు పంచ నిండా రక్తం.... చిక్కగా... జిగటగా కాళ్లకి తగిలింది. మట్టిగోడకి బొమ్మల్లా అంటుకుపోయి ఉన్నారు పిల్లలు.

"ఏటే సిట్టీ.... ఏటయిందే? ఈ రత్తం... ఏటే?" అంటూ పెద్దకూతుర్ని కుదపుతూ ఆత్రంగా ప్రశ్నించాడు అప్పన్న. పదేళ్ల ఆ పెద్దకూతురు పెదవులైతే కదుపుతున్నది కాని నోటి నుంచి మాట మాత్రం ఊడిపడ్డం లేదు. అప్పన్న మనసు ఏదో అశుభాన్ని శంకించింది.

'పోలీ!' అంటూ పిచ్చివాడిలా అరుస్తూ లోపలికి పరుగుపెట్టాడు. మంచం మీద మాసిపోయిన గుడ్డల మూటలా ఉన్న పోలమ్మ మూలుగుతున్నది నీర్సంగా, దీనంగా. మృత్యువు నోటి నుంచి బైటపడ్డ ప్రాణంలా రొప్పుతున్నది. అప్పన్న కేకతో మెల్లగా కళ్లు విప్పి చూసింది. 'మావా' అంటూ లేని శక్తి తెచ్చుకొని బావురుమంది. నూతి లోంచి వచ్చినట్లు వుంది ఆ పిలుపు. పోటులో వున్న సముద్రపు అలలు విరిగి పడ్తున్నట్లుంది ఆ ఏడుపు.

"ఏటే, పోలీ? ఏటైనాదే... పంచలో ఆ రత్తం ఏటే?" ఆందోళనతో అడిగాడు అప్పన్న.

"రావుడు, మావా... రావుడు..." అంటూ ఏడుపు మధ్య ఏమో గొణికింది పోలమ్మ.

"ఏటే... రావుడేటి సేసిండు? తిండి పెట్టనేదనే కోపంతో ఏరినైనా కరిసిండా... ఏటే తిన్నగా సెప్పె పోలీ!"

"సంటాడ్ని మావా... సంటాడ్ని..."

పోలమ్మ మాట పూర్తి చెయ్యనేలేదు. జరిగిందేమిటో గ్రహించుకొన్నాడు అప్పన్న. నిలువెల్లా కోపంతో వణికిపోయాడు మనిషి. ఆవేశంతో కణతల దగ్గర నరాలు పొంగుకొచ్చాయి. "జెష్టకారి ఎదవా.... ఎంతపని సేసేవురా!" అంటూ కోపంగా పెణకలోంచి కర్ర లాగాడు. అదే ఊపులో బైటికి వచ్చాడు.

"ఏటి మావా... ఏటయింది?" అర్థంకాక అడిగాడు హనుమాన్లు.

"ఏటా... ఏటయిందా.... ముందు ఆ రావుడి రత్తం కళ్లసూడనీ.... అప్పుడు సెప్తాం.... ఇస్వాసంలేని ఎదవ. ఇంతకాడి నుంచి పానం పెట్టి పెంచినోడ్ని, ఈఏల తిండి పెట్టలేదని... నా బిడ్డనే పొట్ట పెట్టుకొంటాడ్రా.... ఈ ఏల నీ పానం తీసి మరీ ఒదుల్తారా... నీకు సావు మూడింది.... నిన్ను పెంచిన అప్పన్న సేతిలో సచ్చే యోగం ఉందిరా..."

కోపంతో బుసలు కొడుతూ, కఱ్ఱ చేత్తో పట్టుకొని పరుగు తీసాడు అప్పన్న. చూడి ఆవుని అతి ప్రయాసతో పసులసాల్లో తాటికి కట్టి నుదుట పట్టిన చెమటను తుడుచుకొంటూ ఎదురుపడ్డాడు వీరిగాడు.

"ఏడ్రా! ఈరన్నా!... ఆ రావుడేడ్రా?

మృత్యువులా హూంకరించాడు అప్పన్న. అలా ఆవేశంతో ఒణికిపోతూ బొబ్బలు పెడ్తున్న అప్పన్న ఆకారం చూసి క్షణకాలం నోట మాట లేకుండా నిలిచిపోయాడు వీరన్న.

"ఆడు నీ రుణం తీర్చుకొన్నాడ్రా... నువ్వు సచ్చినా ఆడి బాకీ తీరవనేవు" అన్నాడు వీరిగాడు విచారంగా నిట్టూరుస్తూ.

రాముడి కోసం జోరుగా వెళ్తున్న అప్పన్న వెనుతిరిగి, "ఏటి... ఏటంటున్నావు? రావుడు... నా బొట్టిణ్ణి పొట్టెట్టుకొన్న రావుడు.... నా రుణం తీరుసుకొన్నాడా?"

"ఆడు నీ బొట్టిణ్ణి పొట్ట పెట్టుకోలేదురా... నీ బొట్టిణ్ణి రచ్చించడానికి ఆడి పానం పోగొట్టుకొన్నాడు."

వీరిగాడి మాట సూటిగా వచ్చి అప్పన్న గుండెలో ఎఱ్రగా కాల్చిన ఇనప కడ్డీలా గుచ్చుకొంది.

వీరిగాడు జరిగినదంతా చెప్పాడు.

ఇటు రాముడి మొండిపట్టుతో, అటు ఇంటిదాని రోగంతో సతమతమవుతున్న అప్పన్న ఆ పూట పోట్లపడ్డ మేత విషయం మరచిపోయాడు. దానికి చూలు పట్టిన దగ్గరి నుంచి ఒకటే ఆకలి, కోపం. ఎంత తిండి పెట్టినా చాలదు. మేతకి ఒక్క నిముషం ఆలస్యమైతే ఊరుకోదు. అలా కోపంతో అది ఎన్నోసార్లు పలుపు తెంపుకొని తోటలోపడి పచ్చని చెట్లని తిన్నంత తిని మిగిలిన వాటిని కాళ్లతో తొక్కి నాశనం చెయ్యడం, ఆ ఫలంగా అయ్యగారు దాన్ని అమ్మి పారవేయమని అప్పన్నతో చెప్పడం, అమ్మగారు పుట్టింట పుట్టిన ఆవుపడ్డ అన్న అభిమానంతో ఆపని జరగనియ్యక పోవడం ఆ ఇంట అందరికీ తెలిసిన విషయమే.

'ఒరే అప్పన్నా! వంగడం గల పడ్డరా... ఒక దూడని వేసిందంటే ఆ పొగరంతా అణగిపోతుంది. అంతదాకా కాస్త దాన్ని జాగ్రత్తగా కనిపెట్టి చూస్తుండాలి" అనేది యజమానురాలు.

ఆరోజు అప్పన్న డాక్టరు కోసం వెళ్లాక అది కోపంతో, ఆకలితో పలుపు తెంచుకొని తోటలో పడింది. అప్పన్న ఇంటి ముందుకి పోయి 'అంబా' అంటూ ఓ గావుకేక పెట్టింది.

కట్లు విడిన పోట్లపడ్డని చూసి పిల్లలు భయంతో గొల్లుమన్నారు. దానితో బెదరిపోయిన పడ్డ ఎటుపోవాలో తెలియక అప్పన్న పాకలోకి జొరపడింది. పాకలో మంచం మీద కదలలేని స్థితిలో ఉన్న పోలమ్మ ఇంట్లో జొరపడిన ఆవుపడ్డని చూసి భయంతో ఓ గావుకేక పెట్టింది. అప్పన్న ఇంటి ముందు అలజడి విని వీరిగాడు అక్కడికి పరుగుతో వచ్చేసరికి... అప్పటికే రాముడు పోట్లపడ్డని వీరోచితంగా ఎదిరిస్తున్నాడు. వాడి వంటి నుంచి రక్తం కాలవ కడ్తున్నది. అందిన చోటల్లా కొమ్ములతో పొడిచి పోగులు పెడ్తున్నది పోట్ల పడ్డ.

వీరిగాడు పడ్డని అదుపులోకి తీసుకొన్నాక ఇంక అక్కడ తన అవసరం లేదన్నట్లు తిన్నగా తోటలోకి కుంటుకుంటూ వెళ్లిపోయాడు రాముడు.

అప్పన్న తిరిగి వెళ్లేసరికి డాక్టరు పోలమ్మను తనిఖీచేసి మందు చీటీ రాసాడు. "మరేం పరవాలేదు. జాగ్రత్తగా ఈ మందులు వాడమను" అంటూ హనుమాన్లతో చెప్పి బైటికి వచ్చాడు.

"ఏటిరా మావా.... డాకటేరుబాబుని ఈడనే ఇడిసి అలా పరుగు తీసేవు?" అన్నాడు హనుమాన్లు.

అప్పన్న మాట్లాడలేదు. తిన్నగా పాకలోకి వెళ్లాడు. డాక్టరు ఇచ్చిన ఇన్‌జక్షన్ వల్ల పోలమ్మ మగతగా కళ్లు మూసుకొని ఉంది. పక్కగా ఉన్న చిన్న మంచం మీద పసివాడు కసికందకుండా గుడ్డలమధ్య నిద్రపోతున్నాడు.

మౌనంగా డాక్టర్ని సాగనంపి తిరిగి వచ్చాడు అప్పన్న.

తూరుపు ఆకాశం పోట్లావుచేత కుమ్మబడ్డ రాముడి ఒళ్లులా ఎర్రగా ఉంది. అప్పన్న ఒంట్లో ఆ క్షణంలో అంతమాత్రం శక్తి కూడా మిగిలిలేదు. మానసికంగా, శారీరకంగా ఎంతో అలసిపోయి ఉన్నాడు.

చెట్టు మీద కాకులు గోలగా అరుస్తున్నాయి. చెట్టు కింద రాముడు పెద్ద నిద్రలో ఉన్నాడు. వాడి కంచంలో ఉన్న అన్నంతో ఎర్ర చీమలు తృప్తిగా విందు చేసుకొంటు న్నాయి.

పలుగు పట్టుకొని తోటలో ఒక పక్కగా గొయ్యి తీసాడు అప్పన్న. రాముడ్ని పెంచిన చేతులతోనే వాడిని ఆ గోతిలో దింపాడు. అప్పన్న కళ్ల వెంట కారిన నీళ్లు రక్తపు ముద్దలా ఉన్న రాముడి శరీరంపై పడి, ఆ ఉదయపు ఎండలో మరింత ఎర్రగా కన్పించింది.

గొయ్యి నిండా మన్ను కప్పాడు అప్పన్న. గేటులోంచి నల్లకారు మెల్లగా వచ్చి పోర్టికోలో ఆగింది. సమయానికి ఎక్కడి నుంచో ఆదరా బాదరా వచ్చి తలుపు తాళం తీసాడు మేనేజరు. అయ్యగారి చెయ్యి పట్టుకొని నెమ్మదిగా కారులోంచి దిగారు అమ్మగారు. అమ్మగారి చేతిలో దేనికోసమో ఆత్రంగా చూసాడు అప్పన్న.

ఆమె చేతులు ఖాళీగా ఉన్నాయి. నిండుగా వెళ్ళిన అమ్మగారు ఒంటిగా తిరిగి వచ్చారు.

అమ్మగారి కాళ్ళు పట్టుకొని బావురుమన్నాడు అప్పన్న. వెక్కి వెక్కి ఏడుస్తూనే జరిగినదంతా చెప్పాడు.

"నాను పాపిస్టోడిని అమ్మా... ఆడి తిండికని తమరిచ్చిన సొమ్మెట్టి నా పెల్లానికి మందిప్పించాను. ఆడు నా కోసం మూన్నాలై తిండి నేకపోయినా పోట్లపడ్డతో తలపడి తన పానాలు ఇడిచిపెట్టాడు" అన్నాడు అప్పన్న ఏడుస్తూ.

సరోజమ్మ కళ్ళనీళ్ళతో రాముణ్ణి పాతిపెట్టిన స్థలం దగ్గరికి వెళ్లింది. "రాముడూ.... నువ్వు కూడా ఇలా అన్యాయం చేస్తావనుకోలేదురా" అంది బాధగా.

ఆ మాట విన్న అప్పన్న గుండె తరుక్కుపోయింది.

"తవరికి అన్నాయం సేసింది రావుడు కాదమ్మా... నాను... నాను" అన్నాడు తల కొట్టుకొంటూ.

"ఇందులో ఎవరూ అన్యాయం చెయ్యలేదు అప్పన్నా. ఎవరి బాధ్యతలు వాళ్లు నిర్వహించారు. నువ్వు మనిషివి, రాముడు కుక్క... అంతే తేడా" అన్నారు రాఘవరావు గారు వాడిని ఓదారుస్తూ.